క్లుప్తంగా

శ్రీనివాస్‌రెడ్డికి డాక్టరేట్


శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్ నగర్ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో శ్రీనివాస్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. మంగళవారం కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి, ద చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు శ్రీనివాస్ రెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. శ్రీనివాస్ రెడ్డి చైతన్య యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో సిందాసిస్ ఆఫ్ సమ్ న్యూవ్ ఎటిరోసైకిల్స్ కంటైనింగ్ 123 ప్రాయాజోల్ ఫార్మా కోర్, డే యాంటీ క్యాన్సర్ ఎవల్యూయేషన్ అంశంపై ప్రొఫెసర్ సతీష్‌కుమార్ సూకల పర్యవేక్షణలో పరిశోధన చేశారు. యూనివర్సిటీ కులపతి పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డిలు అభినందించారు.

అక్కడికక్కడే భూ సమస్యలు పరిష్కారం

తహసీల్దార్ గౌతమ్‌కుమార్


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మొయినాబాద్: భూ సమస్యల దరఖాస్తులను గ్రామాల్లోనే పరిష్కరిస్తున్నామని మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు. మంగళవారం చిలుకూరు, మొయినాబాద్ గ్రామాల్లో ఒక బృందం, అమ్డాపూర్, బాకారం జాగీర్, ముర్తుజగూడ గ్రామాల్లో ఒక బృందం పర్యటించి ధరణి దరఖాస్తులను పరిశీలించారు. నేరుగా రైతులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించామన్నారు. ఐదు గ్రామాల్లో మొత్తం 58 దరఖాస్తులను పరిష్కరించామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రమోహన్, రోజా, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

షాద్‌నగర్: ఉత్తర రామేశ్వరంలో మహాశివ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వాహకులు శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అనురాధ దంపతులు, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విశాల, శ్యాంసుందర్‌రెడ్డి, విశాల, వెంకట్ రెడ్డి, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆశన్న గౌడ్, సంపత్‌కుమార్, శ్రీనివాస్, ఈటలు నరేందర్, శివకుమార్, రవీందర్‌రావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

అంబేడ్కర్ అవార్డు గ్రహీత నారాయణదాస్


పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న నారాయణదాస్, నాయకులు

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యంగా చదివితే భవిష్యత్తులో రాణిస్తారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత కడమంచి నారాయణదాస్ అన్నారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు తన స్నేహితులు శ్రీనివాస్ చారి, కె. తిరుపతిరెడ్డిల జన్మదినం సందర్భంగా పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతిలో విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పదవ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు 10వేల ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తానని తిరుపతిరెడ్డి ప్రకటించారు. జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య జరుపుకొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు ప్రకాశ్‌గౌడ్, తెలుగు క్రిష్ణ, సీహెచ్ క్రిష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏసీపీ కిషన్‌కు శుభాకాంక్షలు

షాబాద్: చేవెళ్ల ఏసీపీ కిషన్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎస్‌సీఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు జాకీర్‌షరీఫ్, పామెన నర్సింహులు పేర్కొన్నారు. ఏసీపీ కిషన్‌ను శాలువా, బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.

అపరిశుభ్రంగా అంగన్‌వాడీలు

- సొంత భవనాలు, మరుగుదొడ్ల కరువు
- పిల్లల పౌష్టికాహారాన్ని ఎలుకలు తింటున్న వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు (ఫైల్)

కొత్తూరు: అంగన్‌వాడీ కేంద్రాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను గుర్తించి సరైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుంది. చిన్నారులకు సిబ్బంది పలు రకాల వైద్య పరీక్షలు చేసి వయస్సుకు తగ్గట్లుగా ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆహారంతో పాటు ఆట, పాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. కేంద్రాల పనితీరుపై ఉన్నాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కేంద్రాల్లో నెలకొన్న పరిస్థితుల కారణంగా చిన్నారులు ఆరోగ్యంగా పెరగడం పక్కన పెడితే వారు అనారోగ్యాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. కేంద్రాల్లో నిల్వ చేసిన బాలామృతం ప్యాకెట్లను ఎలుకలు తింటు అక్కడే విసర్జిస్తున్నాయి. పరిసరాలు అపరి శుభ్రంగా మారాయి.

కేంద్రాల వివరాలు ఇలా..

కొత్తూరు మండలంలో 31 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండగా వారిలో 0–3 ఏళ్ల చిన్నారులు 1359 మంది నమోదు కాగా 1298 మంది హాజరవుతున్నారు. 3–6 ఏళ్ల చిన్నారులు 1178 మంది నమోదు కాగా 541 మంది కేంద్రాలకు వస్తున్నారు. వారితో పాటు గతనెల క్రితం వరకు ఐసీడీఎస్ అధికారుల నివేదిక మేరకు మండలంలో 346 మంది గర్భిణులు నమోదు కాగా 263 మంది, 276 మంది బాలింతలు నమోదుగా కాగా 209 మంది కేంద్రాలకు వస్తు పౌష్టికాహారం తీసుకుంటున్నారు.

అసౌకర్యాలకు నెలవుగా..

మండలంలోని 31 కేంద్రాల్లో 16 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 15 కేంద్రాలు యువజన సంఘాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు గదుల్లో కొనసాగుతున్నాయి. టాయిలెట్స్, తాగునీరు లేక చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీలోని 3, 4 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులు ఒకే రేకుల గదిలో అసౌకర్యాల మధ్యన చదువుకుంటున్నారు. అంతేకాకుండా చిన్నారుల ఎత్తు, బరువుతో పాటు పలు రకాల పరీక్షలు నిర్వహించే పరికరాలతో పాటు చిన్నారులను ఆటలు ఆడించేందుకు కేంద్రాలకు తెచ్చిన ఆటవస్తువులను వినియోగించడం లేదు.

అపరిశుభ్రంగా పౌష్టికాహారం..

ఆయా కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణుల కోసం బాలామృతం ప్యాకెట్లు నిల్వచేశారు. సరైన నిర్వహణ లేక రోజుల తరబడి ప్యాకెట్లు అలాగే ఉండడంతో ఎలుకలు తింటున్నాయి. అంతేకాకుండా గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు నిల్వ ఉంచిన చోట ఎలుకల వ్యర్థాలు నిండుకుని అపరిశుభ్రంగా మారాయి. ఆరోగ్యం, చదువు కోసం వచ్చే చిన్నారులు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది.


ఎలుకలు కొట్టిన బాలామృతం సంచులు

సొంత భవనాలు లేక ఇబ్బందులు



మండలంలో 31 కేంద్రాలకు గాను 15 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ఇక్కడ చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతల కోసం ఎలాంటి సౌకర్యాలులేవు. కనీసం మరుగుదొడ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నాం.

– జ్యోతి, ఐసీడీఎస్, సూపర్‌వైజర్, కొత్తూరు

‘ఉపాధి’ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్


కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిల్కమర్రిలో ఉపాధిహామీ పని చేస్తున్న ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కాయకష్టం చేస్తున్న కూలీలకు ప్రభుత్వం నెలనెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని కూలీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉపాధి కూలీలకు ప్రతివారం పేస్లిప్పులు ఇవ్వాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో నీడ కోసం టెంట్లు, నీరు ఏర్పాటు చేయాలని సూచించారు. కొలతలు లేకుండా కూలీలకు రోజు రూ.800లు చెల్లించాలని, దరఖాస్తు చేసుకున్న కూలీలందరికీ ప్రభుత్వం పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో ఫోటోలు తీసే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేఖర్, యాదయ్య, మల్లయ్య, బాలమణి, చెన్నయ్య, శివకుమార్, నర్సమ్మ, రాజు, బాలమ్మ, కృష్ణమ్మ, వీరమ్మ, బాలమణి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామం


మహాపడి పూజ నిర్వహిస్తున్న రాచలింగం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చాకలిగూడలో శివస్వాముల ఇరుముళ్ల పూజలో శివనామస్మరణం మార్మోగింది. మంగళవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన చాకలిగూడలో శివప్ప ద్వదశ జ్యోతిర్లింగ మహాపడిపూజను ఎంపీటీసీ అర్చన యాదయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాచలింగం గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా పూజా విధానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అర్చన మాట్లాడుతూ.. దైవచింతనతో భక్తిభావన పెరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ ఇష్టదైవాన్ని ఆరాధించాలని సూచించారు. శివమాల ధరించిన భక్తులు ఇరుముళ్లతో జ్యోతిర్లింగాలను వెలిగించారు. కార్యక్రమంలో రవి గురుస్వామి, కన్నెస్వాములు హర్షవర్ధన్, అఖిల్, గ్రామస్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్ఎస్ ఆటోమొబైల్ సీఈఓ శ్రీమాన్


శ్రీమాన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్: విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ఎస్ఎస్ ఆటోమొబైల్ సీఈఓ శ్రీమాన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ‘ఇన్విక్టా–2024’ పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కళలు, క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలన్నారు. కళాశాలల్లో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించాలన్నారు. ఎవరికి ఏ రంగంలో ప్రతిభ, నైపుణ్యం ఉందో ఇలాంటి కార్యక్రమాల ద్వారా బయటకు వస్తుందన్నారు. రాష్ట్రంలోని సుమారు 50 కళాశాలల నుంచి విద్యార్థులు ఇన్విక్టాలో పాల్గొన్నారు. డ్యాన్స్, సంగీతం, నాటకం, ఛాయాచిత్రం వంటి కళలను ప్రదర్శించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్ వంటి ఔట్‌డోర్ గేమ్స్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి ఇన్‌డోర్ గేమ్స్ ఆడారు. సాంస్కృతి, క్రీడా కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో మొయినాబాద్ ఎస్సై కిషన్‌జీ, కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యానారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నర్సయ్య, డీఎస్ఏహెడ్ ఉదయశ్రీ, ఫిజికల్ డైరెక్టర్లు కావేరి, సంకేత్, స్పోర్ట్స్ కన్వీనర్లు వినయ్‌సాయి, సాయిచరణ్, కల్చరల్ కన్వీనర్లు శాంతి సిద్దినేని, పడిషాల ఆకాష్, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య


ఫుడ్‌ఫెస్ట్ కార్యక్రమంలో అందెబాబయ్య, విద్యార్థులు

షాద్‌నగర్: పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని శ్రీ కాకతీయ పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అందెబాబయ్య హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. దీంతో ఎలాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. చిన్నారులు జంక్ ఫుడ్‌కు అలవాటు పడొద్దని సూచించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆహారపు అలవాట్ల గురించి ఉపాధ్యాయులు చెప్పడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతిరెడ్డి, వంశీకృష్ణ, మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిఖం భూమిలో ప్రహరీ నిర్మాణం

పట్టించుకోని అధికారులు


శిఖం భూమిలో అక్రమార్కులు వేసిన పిల్లర్లు

శంకర్‌పల్లి: గండిపేట జలాశయం శిఖంభూమిని అక్రమార్కులు కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారని జనవాడ మాజీ ఎంపీటీసీ తలారి మైసయ్య వాపోయారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 519లో ఎకరానికి పైగా భూమిని నగరానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఆ భూమిలో నీరు ఉన్నా.. రాత్రికి రాత్రి మట్టి పోసి చెరువును పూడ్చారని మండిపడ్డారు. శిఖం భూమిలోకి నీరు రాకుండా పెద్ద పెద్ద బండ రాళ్లను చేశామన్నారు. కాగా, సర్వే నంబర్ 519లో కొంత ప్రభుత్వ భూమి కూడా ఉందని తెలిపారు. విషయమై గతంలో జిల్లా కలెక్టర్, శంకర్‌పల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని వివరించారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి చెరువు శిఖం భూమిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలా, నక్షబాటను కాపాడండి


నాలాపై ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ పలకలు

శంకర్‌పల్లి: మహాలింగపురంలోని నాలా, నక్ష బాటను కబ్జా చెర నుంచి కాపాడాలని మహాలింగపురం మాజీ ఉప సర్పంచ్ బొప్పె చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శంకర్‌పల్లి–వికారాబాద్ ప్రధాన రోడ్డులోని లక్ష్మారెడ్డిగూడ గ్రామ శివారుల నుంచి మహాలింగపురం గ్రామ శివారు వరకు 33 అడుగుల నక్షబాటతో పాటు వరద నీరు వెళ్లే నాలా ఉండేదని తెలిపారు. గత కొంతకాలంగా గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులతో పాటు నగరానికి చెందిన స్థిరాస్తి వ్యాపారులు నక్షబాటతో పాటు కాలువను కబ్జా చేసి ప్రీకాస్ట్‌తో పాటు ప్రహరీలను నిర్మాణం చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో ఏకంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారని వాపోయారు. ఈ విషయమై గతంలో శంకర్‌పల్లి తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పాల పైసల్ రావట్లేదు

- రెండు నెలలుగా ఎదురుచూపులు
- రూ. 6 కోట్ల బకాయిలు
- పాల కేంద్రం ఎదుట రైతుల ఆందోళన


కొందుర్గు పాల కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న పాడి రైతులు

కొందుర్గు: గత రెండు నెలలుగా పాలబిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు ఆందోళనకు దిగారు. డబ్బులేక పశువులకు దాణా కూడా వేయలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. షాద్‌నగర్ డివిజన్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో పాడిరైతులకు దాదాపు రూ. 6 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని గ్రామాల్లో 50, షాద్‌నగర్ డివిజన్ ప్రాంతంలో 100కు పైగా పాలకేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో దాదాపు 5 వేల మంది పాడి రైతులు ప్రతిరోజు దాదాపు 30 వేల లీటర్ల పాలను విజయడైయిరీలో విక్రయిస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా రైతులకు బిల్లులు ఇవ్వకపోవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. వ్యవసాయానికి అనుసంధానంగా పశుపోషణ నిర్వహిస్తారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరి గూడ మండలాల్లో దాదాపు 1500 మంది రైతులు రోజుకు 8 వేల లీటర్ల పాలను విక్రయిస్తున్నారు. ఈ రెండు మండలాల రైతులకు దాదాపు రూ. 2 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

నాలుగు ఏళ్లుగా పెండింగ్‌లోనే..

పాడి రైతులకు లీటరుకు రూ.4 ప్రోత్సాహకం ఇవ్వాల్సి ఉండగా నాలుగు ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వడంతో పాటు ప్రైవేట్ పాల కేంద్రాల కన్నా లీటరుకు రూ. 8 వరకు అధికంగా చెల్లించడం జరుగుతుందనే ఆశతో పాడి రైతులు విజయ డైయిరీలో పాలు విక్రయిస్తున్నారు. ప్రోత్సాహకం అటుంచి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రావడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రూ.50 వేలు ఇవ్వాలి



ప్రతిరోజు 20 లీటర్ల పాలు పోస్తాను. నాకు 50 రోజుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆవులకు దాణా పెట్టడానికి కూడా డబ్బులు లేవు. ఇలాగైతే ఎలా బతకాలి. ప్రభుత్వం లీటరుకు నాలుగు రూపాయలు అధికంగా ఇస్తామన్నారు. కాని, మాకు రావాల్సిన బిల్లులే రాకపోవడం బాధాకరం.

– రామచంద్రారెడ్డి, పాడి రైతు ముట్పూర్

50 రోజుల బిల్లులు రావాలి



నేను కొందుర్గు పాలకేంద్రం ఏజెంట్.. మా కేంద్రానికి 50 రోజుల పాల బిల్లులు రావాలి. లీటర్‌కు 90 పైసల కమీషన్ ఇవ్వాలి. కాని బిల్లులు కూడా రైతులకు సకాలంలో ఇవ్వకపోవడం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బిల్లులు సకాలంలో ఇస్తే బాగుంటుంది.

– నర్సింలు, కొందుర్గు పాలకేంద్రం ఏజెంట్

అభివృద్ధి చేసినప్పుడే గుర్తింపు

మాజీ సర్పంచ్ చందనచంద్రయ్య

మొయినాబాద్‌రూరల్: ఐదేళ్లు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేశామని ఎన్కెపల్లి మాజీ సర్పంచ్ చందనచంద్రయ్య అన్నారు. మండలంలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్, వార్డు సభ్యులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చందనచంద్రయ్య మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి చేసినప్పుడే ప్రజలు మరచిపోరని అన్నారు. పదవీ కాలం ముగిసినా ప్రజల కోసం సేవ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జెల్లెల వెంకటమ్మ, మాజీ వార్డు సభ్యులు అమరేందర్‌రెడ్డి, సురేష్ శ్రీలత, దానయ్య, సునీల్, అమృత పాల్గొన్నారు.

కార్యదర్శులకు న్యాయం జరిగేలా కృషి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

షాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జూనియర్ పంచాయ తీ కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డిని కలిసి వి నతిపత్రం అందజేశారు. జూనియర్ పంచా యతీ కార్యదర్శులకు స్పోర్ట్స్ కోటాలో (ఐఎఎస్) కమిటీ ద్వారా ఎంపిక చేసింది. రెండు సంవత్సరాల ఐదు నెలలుగా ఉద్యోగం చేసిన తర్వాత చేయని తప్పు కి గత ప్రభుత్వం తొలగించిందని మాకు న్యాయం చేయా లని కోరారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యల ను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాఘవేందర్, కార్యదర్శులు తదితరులున్నారు.

‘పల్స్ పోలియో’ వందశాతం పూర్తి

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్


సిబ్బందికి అభినందనలు తెలుపుతున్న దామోదర్

చేవెళ్ల: ‘పల్స్ పోలియో’ను డివిజన్‌లో వైద్యారోగ్య సిబ్బంది వందశాతానికి పైగా పూర్తి చేసినట్లు డిప్యూటీ డీఎహెంచ్ఓ దామోదర్ పేర్కొన్నారు. పల్స్‌పోలియో మూడు రోజుల కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. డివిజన్‌లోని అన్ని మండలాల్లోని పీహెచ్‌సీల పరిధిలో ఇచ్చిన టార్గెట్లకు మించి పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల పరిధిలో ఆరు పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. చేవెళ్ల డివిజన్‌లో 5ఏళ్ల లోపు పిల్లలు 26,518 మంది ఉన్నారు. 3వ తేదీన 25,546 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయగా, 4వ తేదీన ఇంటింటికి తిరిగి 658 మంది, 5వ తేదీన 751 మందికి పోలియో చుక్కలను వేసినట్లు చెప్పారు. మొత్తం 26,955కి పోలియో చుక్కలు వేసి 102శాతంగా నమోదు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు గోపాల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

‘ప్రజాదీవెన’ను జయప్రదం చేయండి

కాంగ్రెస్ నాయకుడు వీరేశ్

కేశంపేట: మహబూబ్‌నగర్‌లో నేడు నిర్వహించనున్న ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రజాదీవెన వాల్‌పోస్టర్‌ను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నిర్వహించిన న్యాయయాత్ర ముగింపు కార్యక్రమం నేడు మహబూబ్‌నగర్‌లో ప్రజాదీవెన సభతో ముగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, గిరియాదవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు